క్లుప్తంగా

రైతుభరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు



ప్రొఫెసర్ చెరుకూరి శ్రీనివాసరావు

శావల్యాపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందుతున్నాయని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెరుకూరి శ్రీనివాసరావు అన్నారు. సంక్రాంతికి ఆయన స్వగ్రామానికి వచ్చిన ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వర్సిటీ ఉత్పత్తి చేసిన వరి వంగడాలు భారతదేశంలో 40 శాతం మంది రైతులు సాగు చేస్తున్నారని వెల్లడించారు. మన రాష్ట్రంలో సాగు చేసే వేరు శనగ విత్తనాల ఉత్పత్తి చేసినట్లు వివరించారు. పురగు మందుల వాడకం తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నరసరావుపేట ఈస్ట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీపట్టాభిరామ స్వామి దేవాలయంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణమండపంలో మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీఅయ్యప్పస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొత్తూరి వెంకట శివవేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవా రి కల్యాణోత్సవంలో గజలక్ష్మీ భక్త బృందం అ న్నమాచార్య సంకీర్తనలు ఆలపించి భక్తులను అలరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వేంకటేశ్వరరావు, ప్రవల్లిక సత్యం, ఎస్ఈసీ కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్, వక్కలగడ్డ సురేష్ పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆలయ ధర్మకర్త అన్నపూర్ణమ్మ మృతి



నాదెండ్ల: గణపవరంలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అనుమంచి అన్నపూర్ణమ్మ(87) మృతి చెందారు. ఈ ఆలయాన్ని ఆమె మామగారైన అనుమంచి హనుమంతరావు రెండు వందల ఏళ్ల క్రితం నిర్మించారు. నాటి నుంచి ఆలయానికి ఈ కుటుంబానికి చెందిన వారే ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఆమె భర్త లక్ష్మీనారాయణ జీవిత కాలం గణపవరం గ్రామ కరణంగా పని చేశారు. 1983లో ఎన్టీ రామారావు ప్రభుత్వ హయాంలో కరణం వ్యవస్థ బదులు గ్రామ రెవెన్యూ విధానం తీసుకురావటంతో ఆమె కుమారుడు సూర్యప్రకాశరావు 1994 వరకూ వీఆర్వోగా విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. ఆమెకు ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

చదువులో రాణించాలి

అచ్చంపేట: సేవా సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని ఎంఈవో వి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఇద్దరు నిరుపేద బీటెక్ విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం అచ్చంపేటలో లాప్‌టాప్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న రవి విహితకు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేల విలువ చేసే లాప్‌టాప్, ఫీజు కోసం రూ.60వేలు ఇస్తున్నట్లు స్నేహ హస్తాలు కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తెలిపారు. గుంటూరు ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదవే పాకాలపాటి శృతి అనే విద్యార్థికి లాప్‌టాప్, కాలేజీ ఫీజు నిమిత్తం రూ.45వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చదువులు ఆగిపోకూడదన్న లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తుందని కరిముల్లా బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుమ్మా శౌర్రెడ్డి, స్నేహ హస్తాలు సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు ప్రభుత్వ పథకాలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగనన్న ఆదర్శవంతమైన పాలనను అందిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 36వ వార్డు పరిధిలోని పండరీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరించారు. ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ, స్థానికుల సమస్యలు వింటూ వాటికి పరిష్కారాలను సంబంధిత అధికారులకు తెలుపుతూ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ అందజేస్తోందని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతోందని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు– నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట రాజేంద్రప్రసాద్, విడదల కమలేంద్ర, రామిశెట్టి శివప్రసాద్, బత్తుల కుమారస్వామి, శ్రీగణేష్, కోయిలమూడి అరుణ, బాష, సత్యనారాయణ, ఆవుల భాగ్యలక్ష్మి, శీలంశెట్టి కళావతి, తిరుమలశెట్టి సుధారాణి పాల్గొన్నారు.

వటవృక్షాంతర్గత వేంకటేశ్వరుడి కల్యాణం..

- స్వామి దర్శనం సర్వపాప హరణం
- మల్లాదిలో ఘనంగా 46వ వార్షికోత్సవ వేడుకలు
- 22న స్వామివారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



కల్యాణోత్సవ ఉత్సవ మూర్తులు



వెంకటేశ్వరస్వామి దేవస్థానం

అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రం.. అమరావతి నుంచి క్రోసూరు మార్గంలోని మల్లాది గ్రామంలో వేంచేసియున్న శ్రీ వటవృక్షాంతర్గత(మర్రిచెట్టులో వెలసిన) శ్రీ వేంకటేశ్వరుడు నాలుగు దశాబ్దాలుగా భక్తుల పాలిట కల్పవృక్షంగా నిత్యం పూజలందుకుంటున్నారు. స్వయంభుగా శ్రీ వటవృక్షాంతర్గత వెంకటేశ్వరస్వామి గా అవతరించిన సుదినం నుంచి ఏటా.. జనవరి 22న స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువుగా నిర్వహిస్తున్నారు. సంతానం లేనివారు నియమానుసారం స్వామిని సేవిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని.. భక్తుల నమ్మకం.స్వామి దర్శనంతో.. దీర్ఘకాలిక వ్యాధులు, ఆర్థిక ఇబ్బందులు తొలగి మానసిక ప్రశాంతతతో భక్తులు జీవిస్తున్నారని చెప్పటానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. సత్తెనపల్లికి చెందిన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యేలూరి మంగాయమ్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. చెట్టు పక్కనే పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి సుందరమైన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది 46వ వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు యేలూరి సీతారామయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు సిద్ధం..

ఈ సందర్భంగా మంగళవారం ఆలయ అర్చకుడు వినుకొండ శ్రీనివాసాచార్యులు కల్యాణోత్సవ కా ర్యక్రమాలను వివరించారు.. ఈ నెల 21న స్వామివారికి నక్షత్ర కలశ స్నపన, స్వామి వారినిపెండ్లి కుమారుడిని చేయడం జరుగుతుందన్నారు. కల్యాణోత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 22న ఉదయం అమరావతి వాసవీ మహిళా మండలి వారిచే విష్ణు సహస్రనామ పారాయణంతో స్వామివారికి తులసీదళ సేవ జరుగుతుందన్నారు. మధ్యా హ్నం 12 గంటలకు పరుచూరి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవ అనంతరం భక్తులందరికి అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారిని పెద శేష వాహనంపై వైభవంగా గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు. తాత్కాలిక క్యూలైన్‌లు, ఉచిత ప్రసాదం, తాగు నీరు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఈ కల్యాణోత్సవ వేడుకల్లో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

పాల సొసైటీ ఎన్నిక వాయిదా

శావల్యాపురం: మండలంలోని కారుమంచిలో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి నాదెండ్ల రామకృష్ణ మంగళవారం తెలిపారు. డెయిరీ ఉన్నతాధికారులు ఆదేశాలకు ఎన్నికల తేదీ ఖరారు చేసి ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పథకంలో 312 నూతన పనులు గుర్తింపు

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 312 నూతన పనులను గుర్తించగా అంచనా విలువ రూ.9.90 కోట్లు నిధులు కేటాయించినట్లు ఎంపీడీఓ పి.సీతారామయ్య మంగళవారం తెలిపారు. అందుకుగాను మండల పరిషత్ తీర్మానం చేసినట్లు చెప్పారు.

గణపవరం బీఓబీ మేనేజర్‌గా జయకుమార్

నాదెండ్ల: గణపవరం సీఆర్ కళాశాల ఆవరణలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి మేనేజర్‌గా పి.జయకుమార్ విధుల్లో చేరారు. ఆయన గుంటూరు అమరావతి రోడ్‌లోని శాఖ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు మేనేజర్‌గా పనిచేసిన నవీనకుమార్ గుంటూరు రీజనల్ ఆఫీసుకు బదిలీ అయ్యారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: ప్రమాదవశాత్తు వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ టి. సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఫిరంగిపురం మండలం వేములూరిపాడు బ్రిడ్జి సమీపంలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అందిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును ఎస్ఐ పరిశీలించారు. మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన రైల్వే కాంట్రాక్ట కూలీగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి



ప్రథమ బహుమతి అందజేస్తున్న దృశ్యం



యడ్లపాడు.. విజేతలతో అతిథులు, నిర్వాహకులు



దొండపాలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

శావల్యాపురం: క్రీడాల్లో గెలుపు– ఓటములు సహజమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లోని విజేతలకు నగదు బహుమతులు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ అంకారావు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి దాతలు, గ్రామస్తుల సహకారంతో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి శావల్యాపురం ఫ్రెండ్స్ యూత్ రూ.10,116, ద్వితీయ బహుమతి ఉప్పరపాలెం రూ. 7,116, మూడో బహుమతి రూ.4,116 అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షులు కర్ణా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జవంగుల బాబు, కొణతం ఎరుకల రెడ్డి, చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు పురిమెట్ల ఆజీం, నాయకులు మలిశెట్టి నరేష్, కమిటీ సభ్యులు తోట ప్రసన్నాంజనేయులు, డి.మస్తాన్, కాజా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

యడ్లపాడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని పీఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు నూతలపాటి కాళిదాసు చెప్పారు. యడ్లపాడు హనుమాన్ షటిల్ యూత్ ఆధ్వర్యంలో 4వ ఏడాది సంక్రాంతి క్రీడా పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించారు. సీనియర్, జూనియర్, బాలబాలికలకు వేర్వేరుగా జరిగాయి. సీనియర్స్ విభాగంలో పి.సుబ్బారావు, వై.వెంకటేశ్వర్లు, జూనియర్స్–16లో కె.అఖిల్, ఎం.ధర్మతేజ, అండర్ –14లో లలిత్, సాయిచరణ్, బాలికల విభాగంలో పి.కావ్య, ఎం.గాయత్రి విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుడమి బిల్డర్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు, రామారావు, నంబూరి శ్రీనివాసరావు, కల్లూరి విజయ్‌కుమార్, నిర్వాహకులు కల్లూరి వాసు, పోపూరి సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో మూడురోజులు పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మంగళవారంతో ముగిశాయి. సంబరాలలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. పోటీల్లో చిన్నారులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవంలో డాక్టర్ పేరం రాజనందరెడ్డి, డాక్టర్ పేరం రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచి జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజనందరెడ్డి మాట్లాడుతూ సంస్కృతిని ప్రతిబింబించేలా సంస్కృతి సంబరాలను నిర్వహిస్తున్న యువకులను అభినందించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కల్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తాం

మంత్రి అంబటి రాంబాబు



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: కల్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేవరంపాడు దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం, అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ వచ్చే తిరుణాళ్ల కల్లా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ నుంచి మంజూరైన రూ . 99 లక్షలతో మండపానికి ఇరువైపుల భక్తుల సౌకర్యార్థం మెట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుముల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన నిధులతో రూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. దాతలు ముందుకు వచ్చి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, జీడీసీఎంఎస్ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పచంలు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, దోమతెరలు పంపిణీ

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు బుడగ జంగాల కాలనీలో జన చైతన్య సమితి ఆధ్వార్యాన ఎన్నారై బాలినేని సీతారామకృష్ణ, గుడిపూడి జడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం వీరపనేని రమేష్ సహకారంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు, దోమ తెరలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై సీతారామకృష్ణరాజు, హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపించాలని, సంచార విధానాన్ని మాని పిల్లలను చదివించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి నిర్వాహకులు దాసరి విజయబాబు, కో–ఆర్డినేటర్ వి.అనిల్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్యం

డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాన్ని దగ్గర చేయటమే ప్రభుత్వం యొక్క లక్ష్యమని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కేవీ ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డిలు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటింటికి ప్రభుత్వ వైద్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వైద్యాన్ని అందించి ప్రజలకు వైద్య సదుపాయాలను అందించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. గ్రామంలో ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం పొందిన గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. గ్రామంలో 330 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఏడుకొండలు, శౌరీలు, సురేశ్‌కుమార్, ఏఎన్ఎంలు రమణకుమారి, భారతి, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శనగ పంట ఈ క్రాప్ చేయించుకోవాలి

ఏడీఏ మస్తానమ్మ

నాదెండ్ల: రబీలో శనగ పంటసాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేట మండలంలో 3,196 హెక్టార్లు, నాదెండ్ల మండలంలో 668 హెక్టార్లు, యడ్లపాడు మండలంలో 810 హెక్టార్లలో పంట సాగు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది వర్షాల కారణంగా కొంత ఆలస్యమైన ప్రస్తుతం పూత, కాపు దశలో ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో దిగుబడి పెంచుకునేందుకు 5 రోజుల వ్యవధిలో ఎకరాకు మల్టీకె (13.0.45) ఒక కిలో చొప్పున ఫార్ములా 4.400 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది శనగ పంటకు రూ.5,230 మద్దతు ధర ప్రకటించిందని, బహిరంగ మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నా, ఈ క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు పంటను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవాలని కోరారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన రామకిషన్‌సింగ్

శావల్యాపురం: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన విద్యాప్రదాత కాహేటి రామకిషన్‌సింగ్ సేవలు అభినందనీయమని శ్రీఅడవి పేరంటాళ్లమ్మ సేవా సమితి సభ్యుడు పాపసాని వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని బొందిలిపాలెంలో రామకిషన్‌సింగ్‌ను సత్కరించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని బొందిలిపాలెం,శానంపూడి, మతుకుమల్లి తదితర గ్రా మాల్లోని చాలా మంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధన అందించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో శ్రీఅడవి పేరంటాళ్లమ్మ కమిటీ సభ్యులు సోమేపల్లి వీరాంజినేయులు, రసపుత్ర అర్జున్‌సింగ్, పసుమర్తి శ్రీనివాసరావు, ముంద్రు రామారావు, మక్కెన సురేష్‌బాబు, శింగారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా పునీత అంతోని చర్చి తిరునాళ్ల



ప్రత్యేక పూజలో పాల్గొన్న పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తురకపాలెం(ముప్పాళ్ల): మండలంలోని తురకపాలెం గ్రామంలోని శ్రీపునీత అంతోనివారి చర్చి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సుమారు 125 సంవత్సరాల పైగా చరిత్ర కలది. పలు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా తిరునాళ్లకు సొంత గ్రామానికి వచ్చి ఘనంగా జరుపుకుంటారు. తిరునాళ్లలో భాగంగా ఉదయం 5గంటలకు చర్చిలో ఆలయ విచారణ గురువులు వై.థామస్ ఆధ్వర్యంలో దివ్యపూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. నల్లపాడు విచారణ గురువు కె.ఇన్నారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ గురువు వై.థామస్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ చేశారు.